నిబంధనల ప్రకారమే ఎఎంసి నిధుల ఖర్చు

ప్రజాశక్తి కథనానికి అధికారుల స్పందన

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక ఎఎంసి కార్యాలయంలో నిధుల ఖర్చు నిబంధనల ప్రకారమే జరిగినట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్యం, మార్కెటింగ్ అధికారి వి.మహేంద్రనాథ్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన రూ.1.42 కోట్లకు పైగా నిధులు పక్కదారి..! శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. స్టేట్ ఆడిట్, మచిలీపట్నం వారి ప్రీ ఆడిట్ జరిగిన తర్వాతనే బిల్లులు పెట్టామని తెలిపారు. ఎఎంసి కార్యదర్శి దీనిపై సవివరణ అందించారన్నారు. నాటి ఎఎంసి ఛైర్మన్ ఆమోదంతోనే రూ.1,42,58,534 సంబంధిత ఖర్చుల ఆధారంగానే వినియోగించినట్లు తెలిపారు. కలిదిండి ఎఎంసి కార్యాలయానికి సంబంధించి ఎటువంటి నిధులు పక్కదారి పట్టలేదని మహేంద్రనాథ్ వివరణ ఇచ్చారు.

బదిలీల్లో బాధలు..!

మెడికల్ సమస్యలున్న ఉపాధ్యాయుల పరిస్థితి దారుణం

మెడికల్ బోర్డులు అంగవైకల్యం తగ్గించి ఇచ్చిన సర్టిఫికెట్లతో గగ్గోలు

బదిలీల్లో మొదటి అవకాశం కోల్పోతున్న పరిస్థితి

డిఇఒ ఆదేశాలుంటేనే మరోసారి వైద్యపరీక్షలు అంటున్న సర్వజన ఆసుపత్రి అధికారులు

విద్యాశాఖ అధికారులను కలిసినా ప్రయోజనం శూన్యం

పాయింట్ల సీలింగ్‌పై డిఎస్‌సి ఉపాధ్యాయులు గగ్గోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయ బదిలీల్లో సమస్యలపై గురువులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ముఖ్యంగా మెడికల్ సమస్యలు ఉన్న ఉపాధ్యాయుల పరిస్థితి మరింత దారుణంగా మారినట్లు చెబుతున్నారు. మెడికల్ బోర్డులు అంగవైకల్యం శాతం తక్కువగా నమోదు చేస్తూ జారీ చేసిన సర్టిఫికెట్లతో బదిలీల్లో మొదటి అవకాశం కోల్పోతున్న పరిస్థితి ఏర్పడినట్లు బాధిత ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు మంగళవారం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన ప్రధాన ఉపాధ్యాయులకు, ఎనిమిదేళ్ల దాటిన ఉపాధ్యాయులకు తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వెరిఫికేషన్, సినియార్టీ జాబితా, అబ్జెక్షన్స్, ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్, ఉద్యోగోన్నతుల ప్రక్రియ వంటివి ఈ నెల 31వ తేదీ వరకూ సాగనున్నాయి. ఏలూరు జిల్లాలో పదివేల మందికిపైగా ఉపాధ్యాయులు ఉండగా దాదాపు సగం మంది ఉపాధ్యాయులకు స్థానం చలనం ఉంటుందని తెలుస్తోంది. పశ్చిమలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

మెడికల్ సమస్యలున్న ఉపాధ్యాయులకు అన్యాయం

విభిన్న ప్రతిభావంతుల కోటాలో ఉద్యోగాలు పొందిన వారు, వయస్సు ప్రభావంతో మెడికల్ సమస్యలు ఏర్పడినవారు, ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరైనా అంగవైకల్యం ఉన్న ఉపాధ్యాయులకు బదిలీల్లో మొదటి అవకాశం కల్పిస్తారు. దీనికి మెడికల్ బోర్డు జారీచేసిన సర్టిఫికెట్ ఆధారంగా చేసుకుంటారు. ఉపాధ్యాయులకు ఏప్రిల్ 25, 26వ తేదీల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి గతంలో ఉన్న సర్టిఫికెట్లు కాకుండా కొత్తగా మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగింది. గతంలో ఉన్న అంగవైకల్యం శాతానికి ఇప్పుడు మెడికల్ బోర్డులు ఇచ్చిన శాతానికి పొంతనే లేకుండాపోయింది. బహిరంగంగా అంగవైకల్యం కనిపిస్తున్నా తక్కువశాతం నమోదు చేసి ఇవ్వడంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు బదిలీల్లో తమకు వచ్చే అవకాశాన్ని కోల్పోతున్నట్లు చెబుతున్నారు. మెడికల్ శాతం తక్కువగా నమోదు చేయడంపై వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు మరోసారి మెడికల్ పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. బాధిత ఉపాధ్యాయులు పలువురు ఏలూరు సర్వజన ఆసుపత్రి అధికారులను కలవగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల పత్రం తెచ్చుకోవాలని తెలిపారు. దీంతో మెడికల్ సమస్యలున్న ఉపాధ్యాయులంతా విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వీరిగోడును విద్యాశాఖ అధికారులు వినకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై బాధిత ఉపాధ్యాయులు తీవ్రంగా కలత చెందుతున్నారు. మెడికల్ సమస్యలతో ఎన్నో బాధలు పడి విద్యాశాఖ కార్యాలయానికి వస్తే కనీసం తమ మాట కూడా వినడంలేదంటూ బాధపడుతున్న పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్ల సమస్యలపై ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మను వివరణకోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పాయింట్ల సీలింగ్‌పై డిఎస్‌సి ఉపాధ్యాయులు గగ్గోలు

గతంలో ఎన్ని సంవత్సరాలు సర్వీస్ ఉంటే అన్ని పాయింట్లు ఏడాదికి మూడు చొప్పున కేటాయించేవారు. ఇప్పుడు పాయింట్లకు ఎనిమిది సంవత్సరాల సీలింగ్ పెట్టారు. అంతకు మించి సర్వీస్ ఉన్నా పాయింట్లు నమోదు లేకుండా చేశారు. దీంతో 2014 డిఎస్‌సి, 2016 స్పెషల్ డిఎస్‌సి, 2015లో బదిలీ అయిన టీచర్లకు నష్టం వాటిల్లుతుందని, జూనియర్, డిఎస్‌సి ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు.

మెరుగైన జీవనానికి యోగా దోహదం

'యోగాంధ్ర' యాప్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

యోగా మెరుగైన జీవనానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక వట్లూరు టిటిడిసిలో బుధవారం ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి యోగా ఓరియెంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 'యోగాంధ్ర' కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకూ నెల రోజులపాటు యోగా మాసంగా పాటిస్తూ, యోగసాధనపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశంతో అవగాహన, శిక్షణ కల్పించబడుతోందన్నారు. యోగాపై శిక్షకులు అందిస్తున్న శిక్షణను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని, తద్వారా ఆరోగ్యకరమైన మంచి జీవన విధానం అలవడుతుందని తెలిపారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. మన భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగమని, ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోడీ మన రాష్ట్రానికి రావడం ఆనందదాయకమన్నారు. జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలంలో మాస్టర్ ట్రెయినర్ల ద్వారా యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహణలో భాగంగా రూపొందించిన యాప్‌ను జెడ్‌పి ఛైర్‌పర్సన్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ యాప్‌లో అందరూ నమోదై ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, ఆయుష్ ఆర్‌డిడి.లక్ష్మి సుభద్ర, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ త్రినాథబాబు పాల్గొన్నారు.

'యోగాంధ్ర' యాప్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెడ్‌పి ఛైర్‌పర్సన్

విఎస్ఎస్ కూలీల వేతన బకాయిలు చెల్లించాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్

అటవీ శాఖ జిల్లా ఏలూరు రేంజ్ అధికారి కుమార్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరుసిటీ

జిల్లాలో వన సంరక్షణ సమితిల్లో పనిచేస్తున్న కూలీలకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. బుధవారం అటవీ శాఖ జిల్లా ఏలూరు రేంజ్ అధికారి కుమార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కమిటీ బృందం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ లింగపాలెం మండలం తోచిలక రాయుడుపాలెం గ్రామంలో పేదలు 2020 నుండి కొత్త ప్లాంటేషన్లు విడుదల చేయాలని, దానిలో పని చూపించాలని అడుగుతున్నా సంబంధిత అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2023లో 15 హెక్టార్ల జామాయిల్ విఎస్ఎస్‌ల కటింగ్ ఆర్డర్ ఇస్తామని, మొన్నటి వరకూ పనిచేసిన అటవీ శాఖ అధికారి ప్రజలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. తోచిలక రాయుడుపాలెం విఎస్ఎస్ ప్రజలను మోసం చేసిన అటవీ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజనులు, పేదలు అడవిలోకి వెళ్లి తునికాకు కోసి ఎండబెట్టి 40 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి రాష్ట్రం విడిపోయిన నాటి నుండి నేటికీ తునికాకు బోనస్ బకాయిలు సుమారు 5 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, పేదల పట్ల ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. కూలీలకు నేటికీ బోనస్ బకాయిలు ఇవ్వకపోవడంతో ఆ ప్రాంతంలోని ఆదివాసీలు, పేదలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క మెట్ట ప్రాంతంలో అటవీ భూముల్లో వన సంరక్షణ సమితిల పేరుతో పనిచేస్తున్న దళితులు, గిరిజనులు, ఇతర పేదలకు రావాల్సిన వేతన బకాయిలు నేటికీ అందక నానా అవస్థలు పడుతున్నారన్నారు. లింగపాలెం మండలం టిహెచ్ఆర్.పాలెం విఎస్ఎస్ కటింగ్ ఆర్డర్ ఇవ్వాలని గత కొంతకాలంగా పేదలు అడుగుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కొత్త ప్లాంటేషన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి, కొండలరావు పాలెం విఎస్ఎస్‌లో పనిచేసిన కూలీలకు నేటికీ వేతనాలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉంగుటూరు మండలం చిన్నఎల్లమిల్లి, పెద్దఎల్లమల్లి, ఎర్రమళ్ల, చేబ్రోలు గ్రామాల్లో పేదలు విఎస్ఎస్ఎల్‌లో పనిచేస్తున్నారని వారికి విఎస్ఎస్‌లో పనిచేసిన కూలీలు వేతన బకాయిలు సుమారు రూ.10 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమస్యలను పరిష్కరించి పేదలకు, దళితులకు, గిరిజనులకు వేతన బకాయిలు విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకుని, అండగా నిలబడాలని డిమాండ్ చేశారు.అనంతరం ఏలూరు రేంజ్ కుమార్ మాట్లాడుతూ పేదల పక్షాన అటవీశాఖ అధికారులు నిక్కచ్చిగా పనిచేయాలని సూచిస్తామన్నారు. వేతన బకాయిలు, పెండింగ్లో ఉన్న తునికాకు బోనస్ బకాయిలు వెంటనే విడుదల చేయడం కోసం రాష్ట్రస్థాయి అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

అటవీ శాఖ జిల్లా ఏలూరు రేంజ్ అధికారి కుమార్‌కు వినతిపత్రం అందజేసిన వ్యకాస నేతలు

పంగిడిగూడెం ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పంగిడిగూడెం ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెం గ్రామంలోని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ఆధ్వర్యంలో భూ పోరాట కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా గ్రామంలోని భూమిలేని పేదలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని అనంతరం మాట్లాడారు. గ్రామంలోని 200 ఎకరాల పైబడి ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నాయని, సర్వే నెంబర్ 150, 215/3,4, 217 ఇంకా 222 కొన్ని సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని, రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. ఇప్పటికే పేదలపై ఆ భూముల్లో సాగు చేస్తుంటే భూస్వాములు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకపక్క ల్యాండ్ సీలింగ్ చట్టంలో పేదలకు చెందాలని ఉన్నప్పటికీ ఈ చట్టాలన్నీ పక్కనపెట్టి భూస్వాములతో ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై భూములను భూస్వాములకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే పేదలు పోరాటం చేసే క్రమంలో అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. చట్టాన్ని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు, పోలీసులు చట్టాన్ని దుర్వినియోగం చేస్తుంటే పేదలు, ప్రజలు ఎవరికి చెప్పుకోవాలని ప్రభుత్వాన్ని, రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. సిపిఎం పేదలకు అండగా ఉంటుందని, గతంలో ఈ గ్రామంలో భూ పోరాటాలు నిర్వహించి భూములు పంచిన ఘనత సిపిఎంకే దక్కుతుందని అన్నారు. తక్షణం ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్పందించి భూములు ఆక్రమించుకొని సాగు చేస్తున్న భూస్వాములపై కేసులు నమోదు చేసి పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని, మిగిలిన ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంపిణీ చేయాలని, లేని పక్షంలో గ్రామంలోని పేదలందరినీ ఐక్యం చేసి భూములు స్వాధీనం చేసుకుని భూముల్లో సాగుచేసి పంటలు పండిస్తామని ప్రభుత్వాన్ని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు అందుకుల ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, గ్రామ భూ పోరాట నాయకులు ఎం.బాలరాజు, ఎం.అశోక్ కుమార్, కె.ఏసు, కె.సుబ్బారావు, ఎం.కుమారి, డి.సత్యవతి పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు జిల్లాకు అంబేద్కర్ యూనివర్సిటీ మణిహారం

త్వరలో యూనివర్సిటీ ఏర్పాటు - గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఏలూరు జిల్లాలో అంబేద్కర్ యూనివర్సిటీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుభపరిణామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. జిల్లాకు అంబేద్కర్ యూనివర్సిటీ మణిహారమన్నారు. కొంత మంది విద్యార్థులు కొన్ని కారణాల వల్ల విద్యను మధ్యలో ఆపేసిన వారు ఈ యూనివర్సిటీ ద్వారా దూర విద్యనభ్యసించి తమ విద్యను కొనసాగించే అవకాశం కలుగుతుందన్నారు. చదువు, వయసుతో సంబంధం లేకుండా అంబేద్కర్ యూనివర్శిటీ ద్వారా దూర విద్యనభ్యసించి డిగ్రీలు పొందొచ్చన్నారు. రాష్ట్రంలో విద్యా శాతం పెరగడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించొచ్చన్నాడు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని, అనేక సంస్కరణలు తెచ్చిందని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏలూరు సమీపంలో ఏర్పాటు కాబోతుండం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కోకో గింజలకు అంతర్జాతీయ ధర ఇవ్వాల్సిందే

కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ఏలూరు అన్నే భవనంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ డిజిపి ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోకో రైతులు సంఘటితంగా, ఐక్యంగా గత మూడు నెలలుగా రైతులు ఉత్పత్తి చేసిన కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కోసం పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈనెల 15, 17 తేదీల్లో ఏలూరు సమీపంలోని సోమవరప్పాడు జాతీయ రహదారి వద్ద ఉన్న మోండలీజ్ కంపెనీ వద్ద చేసిన మహాధర్నా, దీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ నెల 23వ తేదీన ఏలూరు కలెక్టరేట్ చర్చలకు పిలవడాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటివరకు కంపెనీలు, ట్రేడర్లు కొనుగోలు చేసిన కోకో గింజలకు కూడా అంతర్జాతీయ మార్కెట్ ధర వర్తింపజేసి వ్యత్యాసపు ధర చెల్లించాలన్నారు. విదేశీ కోకో గింజల దిగుమతులు వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. కోకో గింజల కొనుగోలు, ధర సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు సింహాద్రి గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొళ్ల వెంకట సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గుదిబండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, ఉప్పల కాశీ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్‌బాబు, పాలడుగు నరసింహారావు, అయ్యగారి శ్రీనివాసరావు, గుర్రం మాధవ, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోకో రైతులు, పెదవేగి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పరిధి ఆయిల్ పామ్ రైతుల సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు పాల్గొన్నారు.



సమావేశంలో కోకో రైతు సంఘం నేతలు

నేడు జిల్లాస్థాయి మినీ మహానాడును జయప్రదం చేయండి

రాష్ట్ర మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు

జిల్లా స్థాయిలో ఈ నెల 22వ తేదీన జరిగే మినీ మహానాడు ఏర్పాట్లపై నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పట్టణంలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో జరిగే మినీ మహానాడుకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు భోజన, మంచినీటి ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని మంత్రి సూచించారు. మండలాధ్యక్షులు, పార్టీ గ్రామ అధ్యక్షులు బూత్ కమిటీ, క్లస్టర్ అధ్యక్షులు అందరూ కలిసి సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. రైతుల సమస్యలపై ఇప్పటికే క్యాబినెట్‌లో చర్చించామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ట్రిపుల్ ఐటీలో గొప్ప మెగా యోగా ప్రదర్శన త్వరలో చేపడతామన్నారు. గతంలో దెబ్బతిన్న పెద్దచెరువు గట్టు మరమ్మతులు త్వరలో చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు జమ చేస్తున్నామన్నారు. గురువారం జరిగే మినీ మహానాడుకు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పి.సత్యనారాయణ, ఎ.చందు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.వంద కోట్ల టర్నోవర్ చేరేలా ఎఎంసి అభివృద్ధి

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - దెందులూరు

రూ.వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకునేలా దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి చేస్తామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చెప్పారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలోని మార్కెట్ యార్డులో దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్‌గా గారపాటి రామసీత సహా డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో అత్యధిక శాతం మంది రైతులు ఉండటంతో వారి సంక్షేమం విషయంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అటువంటి మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా కూటమి పార్టీల సమన్వయంతో ఏకగ్రీవంగా ఎన్నికైన గారపాటి రామసీత, అదేవిధంగా మూడు పార్టీల సమన్వయంతో డైరెక్టర్లు కూడా నియామకం అవ్వటం ఎంతో అభినందనీయమన్నారు. దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, మార్కెట్ యార్డ్‌ను రూ.వంద కోట్ల టర్నోవర్ స్థాయికి తీసుకెళ్లేలా అభివృద్ధి చేస్తామని, రైతులకు విశ్రాంతి భవనం నిర్మించటంతో పాటు రైతుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని, మొక్కజొన్న, ధాన్యం, జొన్నల నిల్వలకు గోడౌన్లు నిర్మించి, రైతులకు నిల్వలపై అతి తక్కువ ధరకే రుణాలు అందించి అండగా ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌యాదవ్, పార్టీ మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), ఏలూరు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి నేతల రవి, నాగరాజు, ఈడ్పుగంటి అనిల్, మారడాని రవి, సీనియర్ నాయకులు స్టాలిన్, ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధా, మోతుకూరి నాని, మోరు శ్రావణి, గుత్తా అనిల్, లాయర్ ప్రభాకర్, మందపాటి వెంకట్రావు, గరికపాటి చంటిబాబు, సహా పలువురు సీనియర్ నాయకులు, పార్టీ మండల సెక్రటరీలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ అధ్యక్షులు సహా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎఎంసి ఛైర్మన్ రామసీతను అభినందిస్తున్న మంత్రి, ఎంఎల్ఎలు

10 నాటికి 13,525 గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు

జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.సత్యనారాయణ

ప్రజాశక్తి - ఏలూరు

జూన్ పదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాల్లో జిల్లాలో 13,525 గృహ ప్రవేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.సత్యనారాయణ చెప్పారు. స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో బుధవారం జిల్లాలో అమలు జరుగుతున్న గృహాల నిర్మాణ ప్రగతిని పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జూన్ పదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల నిరుపేదల గృహాలకు ప్రవేశాలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో 13,525 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాల లక్ష్యంగా నిర్ణయించామని, వీటిలో ఇప్పటివరకు 8,171 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి, 60 శాతం మేర లక్ష్యాలను పూర్తి చేశామన్నారు. 5,400 ఇళ్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని, జూన్ పది నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసి సామూహిక ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఎప్పటికప్పుడు గృహ నిర్మాణ శాఖాధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తూ ముందుగు నడిపిస్తున్నారన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసేందుకు ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు లబ్ధి కలిగిస్తుందని, ఇప్పటివరకు 5,178 మంది లబ్ధిదారులకు రూ.9.28 కోట్లు అందించామన్నారు. వీటితోపాటు లబ్ధిదారులతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అదనంగా మరో రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పావలా వడ్డీకి రుణాలుగా అందిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుని ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిని సాధిస్తున్నామన్నారు.

యోగాంధ్ర 2025పై అవగాహన కల్పించాలి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని అందుకు అనుగుణంగా యోగాంధ్ర 2025పై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం యోగాంధ్ర కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర 2025" మాసోత్సవాల నిర్వహణపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 15 వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జూన్ 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు గుర్తించిన ప్రాంతాల్లో డెమానిస్ట్రేషన్ ఉంటుందన్నారు. అయశాఖల అధికారులు, విద్యా, సచివాలయ, టూరిజం, క్రీడా, ఆయూష్ తదితర ప్రముఖ శాఖల కీలక భాగస్వామ్యం ఉంటుందని వెల్లడించారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆయుష్ ఆర్‌డిడి లక్ష్మీసుభద్ర, జెడ్‌పి సిఇఒ భీమేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, సిపిఒ వాసుదేవరావు, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి నాగరాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముక్కంటి, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, డిఎంహెచ్ఒ ఆర్.మాలిని, సంబంధిత పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ సామగ్రి చోరీ, దుర్వినియోగం

పోలీసులకు ఫిర్యాదు

జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇటీవల పేదల గృహ నిర్మాణ కాలనీల్లో ఇళ్ల నిర్మాణ సామగ్రి దొంగతనాలు, దుర్వినియోగం జరిగాయని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.సత్యనారాయణ చెప్పారు. ఇటీవల కొన్ని దినపత్రికల్లో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ప్రచురితమైన ప్రతికూల వార్తాంశాలపై గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ స్పందిస్తూ దెందులూరు గృహ నిర్మాణ శాఖ గోడౌన్ నుంచి ఇళ్ల నిర్మాణానికి వినియోగించే స్టీల్ దొంగతనం జరిగిందని, అదేవిధంగా నూజివీడు గోడౌన్‌లో డోర్స్, కిటికీలు, స్టీల్, ఎలక్ట్రికల్ సామగ్రి దొంగతనానికి గురయ్యాయన్నారు. సీసీ టివి ఫ్యూటేజ్ ఆధారంగా వీటిపై పోలీసు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. గతేడాది ఇళ్ల నిర్మాణ సామగ్రి ఆడిట్‌లో పెదవేగి, అగిరిపల్లి మండలాల్లో ఇళ్ల నిర్మాణ సామగ్రి దుర్వినియోగం జరిగినట్లు గుర్తించామని, ఆ సమయంలో పనిచేసి మండల ఇన్‌ఛార్జి, గోడౌన్ ఇన్‌ఛార్జులపై శాఖాపరమైన విచారణ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం దుర్వినియోగమైన సొమ్మును రికవరీ చేస్తామన్నారు. చాట్రాయి మండలం సుంకోల్లులో గత ప్రభుత్వ సమయంలో స్థానిక నాయకులు లబ్ధిదారులకు ఇల్లు నిర్మించి ఇస్తామని, ఇళ్ల నిర్మాణ సామగ్రి లబ్ధిదారుల నుంచి తీసుకుని, కొంతమందికి మాత్రమే నిర్మించారన్నారు. సుంకోల్లులో రూ.16.52 లక్షల ఇళ్ల నిర్మాణ సామగ్రి దుర్వినియోగం కేసులో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని, నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఉద్యోగం నుంచి తొలగించినట్లు తెలిపారు. వీరి నుంచి ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం రికవరీ చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు 8302 ఇళ్లు మంజూరు చేయగా వీటిలో 5,563 ఇళ్లు పూర్తయ్యాయని, 2739 ఇళ్లు వివిధ దశలో ఉన్నాయన్నారు. సదరు ఇళ్లకు పాత టెండర్లు రద్దుచేసి, కొత్తగా టెండర్లు పిలుస్తున్నామని, ఈ నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియ పూర్తి అవుతుందని సత్యనారాయణ చెప్పారు.

ఉపాధి పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ కూలీలకు పని చేసే ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కారం నాగ దుర్గ డిమాండ్ చేశారు. మండలంలోని దాట్లవారిగూడెం, వంకవారిగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వేసవి అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు పెంచాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, కారం లక్ష్మి రాముడు, వెంకటలక్ష్మి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు..

బాధిత ఉపాధి కూలీలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధి హామీ పనికి వెళ్లి ప్రమాదానికి గురైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన ఉపాధి హామీ పనికి వెళ్లి వస్తుండగా 16వ నెంబర్ జాతీయ రహదారి భీమడోలు సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఓ ప్రయివేట్ బస్సు ఉపాధి కూలీల ఆటోను ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 14 మందికి కూలీలు గాయాలపాలవ్వగా వీరిలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలవ్వడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించాలని తెలిపారు. ఏలూరు ప్రభుత్వాఆసుపత్రిలో వైద్యం పొందుతున్న కుటుంబాలకు ప్రభుత్వం, అధికారులు అండదండగా ఉండాలని కోరారు. గాయాలపాలై ఇంటి వద్ద ఉన్న కూలీలకు అదనంగా పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురై పనులు కోల్పోయిన వారికి ప్రభుత్వం చట్ట ప్రకారం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టిడిపి మండలాధ్యక్షునిగా సత్యనారాయణ

యాదవ సంఘం సభ్యుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

సత్యనారాయణను అభినందిస్తున్న ప్రముఖులు

టిడిపి మండలాధ్యక్షుడిగా ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ఆదేశాలమేరకు రెండో సారి లంకా సత్యనారాయణ(నత్తివండు) నియమితులయ్యారు. ద్వారకాతిరుమల మండల యాదవ సంఘం సభ్యులు, నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణకు కంపసాటి రామకృష్ణ యాదవ్ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు, సాయిల్ రమేష్ యాదవ్ యాదవ సంఘం మండల అధ్యక్షులు, నీలపాల సత్యనారాయణ, పాకనాటి దుర్గారావు, నీలపాల పెద్ద రామకృష్ణ, ఎర్రగోర్ల నాగరాజు, ఎర్రగోర్ల రామారావు, చింతపల్లి రాంబాబు, మానికల సత్యనారాయణ, ముమ్మిడి సత్యనారాయణ, పాకనాటి శ్రీమన్నారాయణ, జోనుబోయిన భాస్కరరావు శుభాకాంక్షలు తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

వంట ఏజె న్సీలకు వెంటనే బకాయిలు విడుదల చేయాలని ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఎఐసిసిటియు కమిటీ సమావేశం బొమ్మిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన గుడిపాడు గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ గత మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి అందాల్సిన వేతన బకాయిలు నేటికీ చెల్లించకపోవడం దారుణమన్నారు. వారి కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో వంట ఏజెన్సీలకు, శానిటేషన్ కార్మికులకు నేటికీ వేతన బకాయిలు చెల్లించలేదన్నారు. దుకాణాల వద్ద అప్పులు ఇచ్చిన వ్యాపారులు వారిని నానా ఇబ్బందులు పెడుతున్నారని, కనీసం మర్యాద లేకుండా దుర్భాషలాడుతున్నారని, ప్రభుత్వం వారికి వేతన బకాయిలు తక్షణం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసిటియు కమిటీ సభ్యురాలు పల్లెపాము భవాని, ముక్కు నాగేశ్వరరావు, శివ, ఆంజనేయులు, పాముల కృష్ణ, శ్రీనివాసరావు, ఆముదాల చినబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉన్నత విలువలు, ఒత్తిడి లేని విద్య ఎన్‌ఆర్‌ఐ సొంతం

కళాశాల సిఇఒ వి.తులసీరామ్

ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థలు

రవీంద్ర

రాజేంద్రప్రసాద్

తులసీరామ్

ప్రజాశక్తి - ఏలూరు

ఒత్తిడి లేకుండా విషయ పరిజ్ఞానంతో ఉన్నత విలువలతో కూడిన విద్య ఏలూరు ఎన్‌ఆర్‌ఐ కళాశాల సొంతమని ఆ కాలేజీ సిఇఒ వి.తులసీరామ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. నాలుగు దశాబ్దాల క్రితమే గుంగూటరు మెడికల్ కళాశాలలో మెడిసిన్ పూర్తి చేసి, అమెరికా దేశంలోని క్యాలిఫోర్నియాలో ప్రముఖ వైద్యుల్లో ఒకరిగా ఉంటూ భారతదేశ కీర్తిని అమెరికాలో చాటి చెప్పిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలాజిస్ట్ ఆలపాటి రవీంద్ర 2002లో గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద అత్యున్నత ప్రమాణాలతో వసతులతో ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ స్థాపించారన్నారు. కాలేజీ, హాస్పిటల్‌కు డైరెక్టర్‌గా సేవలందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అతి నిరుపేద విద్యార్థుల కోసం సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ అనే ఛారిటీ సంస్థను స్థాపించారన్నారు. ఎంతోమంది విద్యార్థులను ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా చదివిస్తూ వారి జీవితాలను అపురూపంగా తీర్చిదిద్దే క్రమంలో 2008లో ఎన్‌ఆర్‌ఐ అకాడమీని ప్రారంభించి ఒత్తిడిలేని విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ర్యాంకులు, మార్కులే పరమావధిగా కాకుండా విషయ పరిజ్ఞానం, ఉత్తమ విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసే విధానంలో శిక్షణ ఇస్తూ ఉన్నత విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత భావాలు కలిగిన అధ్యాపకులను గౌరవిస్తూ అతి తక్కువ కాలంలోనే తెలుగు ప్రజల అభిమానాన్ని ఆలపాటి రవీంద్ర చురగొన్నారన్నారు.

ఆలపాటి రా జేంద్రప్రసాద్ అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరన్నారు. ఆయ నను అందరూ రాజా అని పిలుస్తారన్నారు. గుం టూరు జిల్లాలో తన విద్యాభ్యాసం డిగ్రీ వరకు పూర్తి చేసి, తర్వాత ఉమ్మడి పశ్చిమగోదారి జిల్లా ఏలూరులో సిఆర్.రెడ్డి కళాశాలలో న్యాయవాద విద్య (ఎల్ఎల్‌బి) 1985లో పూర్తి చేశారన్నారు. అనంతరం హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా పేద ప్రజల కోసం ఎన్నో కేసులు వాదిస్తూ ప్రజాసేవ చేస్తూ సమయంలో అప్పటి సిఎం నందమూరి తారకరామారావు దృష్టికి ఆకర్షించి ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి ఆహ్వానం అందుకుని గుంటూరు జిల్లా వేమూరు, తెనాలి నియోజకవర్గాల్లో శాసన సభ్యునిగా మూడు సార్లు ఎన్నికయ్యారన్నారు. 1995లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మంత్రి వర్గంలో సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా పని చేసి అందరి మన్ననలు పొం దారన్నారు. ప్రజాసేవయే పరమావధిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు వ్యాపార ధోరణిలో కాకుండా ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందించాలనే దృఢ సంకల్పంతో కేవలం వెయ్యి మంది విద్యార్థులతో 2008లో గుంటూరులో ఎన్‌ఆర్‌ఐ అకాడమీ అనే విద్యాసంస్థను ప్రారంభించారన్నారు. దినాదినాభివృద్ధి చెందుతూ తెలుగు రాష్ట్రాల్లో గుంటూరుతో పాటు విజయవాడ, విశాఖపట్నం, ఏలూరు, హైదరాబాద్, శ్రీకాకుళం, విజయనగరం, తిరుపతి, తెనాలి, చెరుకుపల్లి, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం, కడప పట్టణాలకు విస్తరించి ఇప్పుడు సుమారు లక్షమంది విద్యార్థులతో విరాజిల్లుతుందన్నారు. అందరి ఆశీస్సులతో మరికొన్ని పట్టణాలకు విస్తరిస్తూ ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థ విజయ పథాన దూసుకుపోతుందని తెలిపారు.

సంపూర్ణ ఏకగ్రీవంతో గ్రామ కమిటీల నియామకం

దెందులూరు మినీ మహానాడులో ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

మినీమహానాడులో మంత్రి, ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - దెందులూరు

నియోజకవర్గంలోని 85 గ్రామాల్లోనూ సంపూర్ణ ఏకగ్రీవంతో కమిటీల నియామకం చేపట్టామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకం తెలిపారు. టిడిపి దెందులూరు నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం పెదవేగిలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు చెన్నుపాటి గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ నూతన మండల, గ్రామ కమిటీల అధ్యక్షులు, కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేసేలాగా వారిని వెన్నంటి నడిపిస్తూ, ప్రోత్సహించే గురుతల బాధ్యత గతంలో ఆయా స్థానాలను, ఆయా బాధ్యతలు నిర్వహించిన సీనియర్ నాయకుల పట్ల ఉంటుందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నిర్వాకం వల్ల రాష్ట్రంలో పెట్టుబడిలాగిపోయి రాష్ట్రం దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులు పడిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు విజనరీ పాలన చూసి పారిశ్రామిక వేత్తలు భారీగా రాష్ట్రానికి తరలి వస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు కూడా భారీగా వస్తున్నాయని చెప్పారు. చింతమనేని మాట కొంత కటువుగా అనిపించినా కూడా ఆయన ఆవేశమంతా కూడా ప్రజల సమస్యను తీర్చడం కోసమే తప్ప, ఎవరి పైన ఎటువంటి ఆక్రోశం ఉండదని చెప్పారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఎప్పుడూ ఎంతో ఆప్యాయంగా పలకరించే చింతమనేని అంటే తనకు ఎంతో అభిమానమన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎన్నో చారిత్రాత్మక మార్పులు తెచ్చి అన్న నందమూరి తారక రామారావు పరిపాలన అందించారన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీలో ఎటువంటి గ్రూపు విభేదాలు లేకుండా కార్యకర్తల సంక్షేమం, తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, పార్టీల మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), ఏలూరు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి నేతల రవి, ఎన్.నాగరాజు, ఈడ్పుగంటి అనిల్, మారడాని రవి, సీనియర్ నాయకులు స్టాలిన్, ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధా, మోతుకూరీ నాని, మోరు శ్రావణి, గుత్తా అనిల్, లాయర్ ప్రభాకర్, మందపాటి వెంకటరావు, గరికపాటి చంటిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సిసి బాలికల యోగా విన్యాసాలు అద్భుతం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో నాలుగో ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సిసి విజయవాడ బాలికలు బుధవారం యోగాభ్యాసం అద్భుతంగా నిర్వహించారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలేంద్ర సింగ్, క్యాంప్ ఎసిడెంట్ కెప్టెన్ సుబ్బలక్ష్మి సిహెచ్‌లు ఎన్‌సిసి బాలికలకు యోగాభ్యాస నిర్వహణలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిసి శిక్షణలో యుద్ధ నైపుణ్యాలు, ఫైరింగ్, షూటింగ్, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజన్, సోషల్ సర్వీస్ యాక్టివిటీలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. వీటితోపాటు అనేక సామాజిక అంశాలను తెలియజేస్తామన్నారు. అందులో భాగంగానే వచ్చేనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ యోగా మాస్తోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడిటేషన్, యోగా పట్ల బాలికలకు నిత్యం శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా బాలికలు చేసిన యోగా విన్యాసాలు ఆహుతులను అలరించాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ బాలికలను అభినందించారు. భావి భారత పౌరులుగా ఎదిగి, ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఎంఎల్ఎ ధర్మరాజు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పుట్టినరోజు వేడుకను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పత్తేపురానికి చెందిన పొత్తూరి వేణుగోపాల్, గణేష్‌వర్మ ఏర్పాటు చేసిన 300 కేజీల కేకును ధర్మరాజుతో కోయించారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, అధికారులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో ప్రతి మండలంలో ఒక పంచాయతీని తీసుకోని మూడు నెలల్లో ఆదర్శ పంచాయతీగా అని రకాలుగా అభివృద్ధి చేయాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని వికెఎం ఫంక్షన్ హాల్ వద్ద జిల్లా డిపిఒ అనురాధ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా నుంచి వచ్చింది ప్రజలకు సేవ చేయటానికి, నియోజకవర్గం అభివృద్ధి చేయటానికి అని తెలిపారు. తాను ప్యాషన్‌తో పని చేస్తున్నానని, అధికారులు కూడా పంచాయతీల అభివృద్ధికి ప్యాషన్‌తో పని చేయాలని కోరారు. నిర్లక్ష్యం వదిలి, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని కోరారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని తెలిపారు. 14, 15వ ఆర్థిక సంవత్సరం నిధుల వివరాలు, జమ ఖర్చులు, పన్నుల వివరాలు అందించాలని కోరారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు, హామీలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో గవర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో పాటు నాణ్యమైన విద్యుత్, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అదనపు రేటుతో కొనుగోలు చేసిన విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, కంచం వరప్రసాద్, లావేటి సోంబాబు, కానూరు రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు గండ్లను వెంటనే పూడ్చాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గతేడాది సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో పట్టణంలోని కొప్పుల వెలంపేటకు ఆనుకుని ఉన్న పెద్ద చెరువు నాలుగు చోట్ల గండ్లు పడి చెరువు కింద ఉన్న పంట పొలాలు పంట ఉండగానే వరదలతో కొట్టుకుపోయాయన్నారు. అంతేకాకుండా చెరువు కింద ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరి ఆస్తి నష్టం చాలా జరిగిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగు గండ్లను పూడ్చలేదన్నారు. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి చెరువుకు పడిన గండ్లను వెంటనే పటిష్టంగా పూడ్చాలన్నారు.

పచ్చటి మణిహారం కనుమరుగు..!

చెరువులు తవ్వక ముందు ఇలా...

రొయ్యల చెరువులుగా మారుతున్న పంట పొలాలు

వ్యవసాయ, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే తవ్వకాలు

తవ్విన తర్వాత ఇలా...

ప్రజాశక్తి - మండవల్లి

పచ్చని మణిహారంలా కనువిందు చేస్తూ రైతులకు ఆహార ధాన్యాన్ని అందిస్తున్న పంట పొలాలు నేడు రూపును కోల్పోతున్నాయి. కొందరు స్వార్థపరుల అక్రమార్జన అధికారుల ఆర్థిక వ్యామోహంతో పంట పొలాలు రొయ్యల చెరువులుగా మారిపోతున్నాయి. ఈ దుశ్చర్యతో సారవంతమైన భూమి కలుషితమై సహజ ప్రకృతి వనరులు నశించిపోతున్నాయి. ఈ ప్రభావం తాగునీటి చెరువులపై పడడంతో ప్రజలకు దాహం కేకలు తప్పడం లేదు. వ్యవసాయ శాఖ కార్యాలయం ముందే యథేచ్ఛగా పొక్లెయిన్లు వికటాహాసంతో అధికారుల చెవులకు వినబడేలా మోత మోగిస్తూ పంట పొలాలను చెరువులుగా పెకలించి వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమార్జనే ధ్యేయంగా అక్రమార్కులకు సహకరిస్తూ కాసుల మత్తులో జోగుతున్నారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం రొయ్యల చెరువుల తవ్వకాలకు అనుమతులను నిలుపుదల చేసింది. అంతేకాకుండా రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు వ్యవసాయ రంగంలో ఎన్నో వినూత్న మార్పులను తీసుకురావడంతో పాటు రైతుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తుంది. ఇదిలా ఉంటే మండవల్లి వ్యవసాయ శాఖ కార్యాలయం ముందే ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు 65 ఎకరాల పైబడి పంట పొలాలను రొయ్యల చెరువుగా మార్చేస్తున్నారు. రెండు పంటలు పుష్కలంగా పండే పంట భూములను తవ్వేస్తున్న పట్టించుకోవడం లేదంటే అధికారులు అవినీతికి ఏ విధంగా కొమ్ముకాస్తున్నారనే విషయాన్ని తేటతెల్లం చేస్తుంది. దీంతో అధికారులు అందిస్తున్న సహాయ సహకారాలతో మండవల్లి మండలంలో వందల ఎకరాల్లోని పంట పొలాలు రొయ్యల చెరువులుగా మారిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగటు పేద రైతు పాత చెరువు మరమ్మతులు చేసుకోవాలంటే రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తున్న సమయంలో కొత్త రొయ్యల చెరువు తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు నిలుపుదల చేసినప్పటికీ రెవెన్యూ శాఖ కార్యాలయం ముందే రెండు పంటలు పండే పంట భూములను రొయ్యల చెరువులుగా ఎందుకు మారుస్తున్నారని, అనుమతులు ఎవరు, ఎందుకు ఇచ్చారనేది ప్రశ్నగా ఉంది. మరి దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించి రొయ్యల చెరువు తవ్వకాలను అడ్డుకుంటారా మండల అధికారులతో చేతులు కలిపేసి మరిన్ని పంట పొలాలు రొయ్యల చెరువులుగా మార్చేస్తారా అనేది తెలియాలంటే వేచి చూడాల్సి ఉంది. దీనిపై వ్యవసాయ శాఖ ఎఒ జరీనాను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. దీనిపై ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్‌ను వివరణ కోరగా చెరువుల తవ్వకాలకు అనుమతులు లేవ, పరిశీలిస్తామని చెప్పారు.

'యోగాతో ఆరోగ్యం'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మనిషి ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండడానికి యోగా సరైన మార్గమని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ అన్నారు. జూన్ 21వ తేదీన 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం నుంచి నెల రోజుల పాటు ప్రతిరోజు యోగా క్లాసులు నిర్వహిస్తూ యోగా విశిష్టతపై ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విశాఖపట్నం వేదికగా జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి పిఎం నరేంద్ర మోడీ హాజరవుతున్నారన్నారు. యోగా చేయడం వల్ల మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని యోగాసనాలు చేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా గురువు శివ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, మేనేజర్ మూర్తి, డిఇలు, ఎఇలు, పిఒ, మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించి అన్ని సెక్షన్ల, అధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం : యోగాను ప్రతిఒక్కరూ తమ జీవిత భాగంగా చేసుకోవాలని, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరమని ఏపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరం మండల ప్రజా పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బొరగం శ్రీనివాసులు పాల్గొని యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, ఎపిఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గంగరాజు, పంచాయతీ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి రూ.3.92 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీలు బుధవారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడిచిన 34 రోజులకు రూ.3,92,94,035 ఆదాయం వచ్చింది. అలాగే యాత్రికుల కానుకల రూపేణ 556 గ్రాముల బంగారం, ఎనిమిది కేజీల 100 గ్రాముల వెండి, పాత రూ.500 నోటు 39, వెయ్యి నోట్లు మూడు, రూ.రెండు వేల నోట్లు 22, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు, కేశఖండనశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No:139/2025 In O.S.No: 62 of 2025

Between:
పిటిషనర్/వాది: బొబ్బిలి శివ గంగా విష్ణు కుమార్
And
రెస్పాండెంట్/ప్రతివాది:
కాళ్ళకూరి విజయ కనకదుర్గ
రెస్పాండెంట్/ప్రతివాది అడ్రసు:
కాళ్ళకూరి విజయ కనకదుర్గ,
W/o.విజయ్, వయస్సు: 46 సం.లు,
R/o H.No.1-84, (Old H.No. 1-137),
లక్ష్మి నారాయణ నిలయం, శ్రీనగర్ కాలనీ,
రాయలం, భీమవరం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్,
భీమవరం సివిల్ కోర్ట్స్, పిన్ కోడ్:534202.

పై నంబరు పిటిషన్‌కు సంబంధించి రెస్పాండెంట్/ప్రతివాది అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారా నేరుగా అలాగే రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన పై పిటిషన్ నోటీసులు, సెక్యూరిటీ నోటీసులు, అటాచ్మెంట్ నోటీసులు తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచూ కాలయాపన చేస్తున్నారు. కావున పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసులు ఇవ్వడమైనది. కావున సదరు రెస్పాండెంట్/ప్రతివాది ది.**16-06-2025** సంవత్సరం తేదీన ఉదయం గం.10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను, లేనియెడల సదరు రెస్పాండెంట్/ప్రతివాది పరోక్షమందు (Ex- Parte గా) పై పిటిషన్ తీర్మానించబడును.

సొరపల్లి సత్య నరేష్ కుమార్,
Place : భీమవరం, న్యాయవాది, భీమవరం
Date: 22-05-2025 Ph:9781123789.

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No: 62 of 2025

Between:
వాది: బొబ్బిలి శివ గంగా విష్ణు కుమార్
And
ప్రతివాది: కాళ్ళకూరి విజయ కనకదుర్గ
ప్రతివాది అడ్రసు:
కాళ్ళకూరి విజయ కనకదుర్గ, W/o.విజయ్, వయస్సు: 46 సం.లు, R/o H. No. 1-84, (Old H.No.1-137), లక్ష్మి నారాయణ నిలయం, శ్రీ నగర్ కాలనీ, రాయలం, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం సివిల్ కోర్ట్స్, పిన్ కోడ్:534202.

పై నంబరు దావాకు సంబంధించి ప్రతివాది అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారా నేరుగా అలాగే రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన దావా సమన్లు తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచూ కాలయాపన చేస్తున్నారు. కావున పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా సమన్లు ఇవ్వడమైనది. కావున సదరు ప్రతివాది **ది.16-06-2025** సంవత్సరం తేదీన ఉదయం గం.10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను, లేనియెడల సదరు ప్రతివాది పరోక్షమందు (Ex- Parte గా) పై దావా తీర్మానించబడును.

సొరపల్లి సత్య నరేష్ కుమార్,
Place : భీమవరం, న్యాయవాది, భీమవరం
Date: 22-05-2025 Ph:9781123789.